సాక్షి శ్రీకాకుళం

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



సారా స్థావరాలు ధ్వంసం

ఏఓబీలో సారా స్థావరాలు ధ్వంసం చేశారు. ఆంధ్రా ఒడిశా పోలీసులు దాడులు చేశారు.


-IIలో



జాతీయ స్థాయి ఎన్‌సీసీకి..

జాతీయస్థాయి ఎన్‌సీసీ క్యాంపునకు కల్పన ఎంపికైంది. ఈమె శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతోంది.

-IIలో



న్యూస్‌రీల్

7న జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి అండర్–17 బాల బాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 7వ తేదీన జరగనున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిశోర్ తెలిపారు. నరసన్నపేటలోని ఎంజేపీఏపీ రెసిడెన్షియల్ స్కూల్ గుండివిల్లిపేట వేదికగా ఈ ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీల్లో కృష్ణా జిల్లా గుడివాడలో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి అండర్–17 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఏపీ చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సనపల భీమారావు వెల్లడించారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 17 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని స్పష్టంచేశారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు 74168 64642 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ప్రవేశ రుసుంగా రూ.200 చెల్లించి పోటీల్లో పాల్గొనాలని వారు స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించాల్సిందే: కలెక్టర్



గారలో ఫ్లయింగ్ స్క్వాడ్ పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

గార: ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు కావాలని, ఓటరు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలు ఉండాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. మండలంలో తహసీల్దార్ కార్యాలయాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్ పనితీరును ఆయన శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా, హింసారహితంగా నిర్వహించడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని అన్నారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎఫ్ఎస్టీ బృందాల పనితీరును స్వయంగా పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్ఠంగా పని చేసే విధంగా ముందుగానే తగు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యూపీ, ప్రైమరీ పాఠశాలల్లో వసతులు పరిశీలించాలని, ఏర్పాట్లు, తనిఖీలపై అలసత్వం వద్దన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, సీఐ ఎల్. సన్యాసి నాయుడు, తహసీల్దార్ ఎం.శ్రీను, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం రద్దు



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రతి నెల మొదటి శనివారం నిర్వహిస్తున్న డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత తెలిపారు. ఈ మేరకు వర్సిటీ నుంచి శుక్రవారం ప్రకటన జారీ చేశారు. ఎన్నికలు కోడ్ ముగిశాక కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని అన్నారు.

మన సంజీవని



కిడ్నీ రాళ్ల తొలగింపు.. శ్రీకాకుళం వరకు పరుగెత్తాల్సిన పని లేదు. డయాలసిస్‌లో ఇబ్బందులు.. విశాఖ వరకు వెళ్లాల్సిన అగత్యం లేదు. అత్యవసరంగా అత్యాధునిక వైద్యం చేయాలి.. ఆస్తులేవీ అమ్ముకోవాల్సిన అవసరం లేదు. స్కానింగ్ పరీక్ష.. పర్సు నిండా డబ్బు పట్టుకుని కార్పొరేట్ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన అవస్థ లేదు. ఒకే ఒక్క ఆస్పత్రి.. ఉద్దానం కంట కన్నీరు తుడుస్తోంది. ఒకే ఒక్క ఆస్పత్రి.. ఇక్కడి ఆడపడుచుల పసుపు కుంకుమలకు రక్షగా నిలుస్తోంది. ఒకే ఒక్క ఆస్పత్రి.. దశాబ్దాల వేదనకు ఓ ముగింపు పలుకుతోంది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అత్యాధునిక పరికరాలతో అపర సంజీవనిలా కనిపిస్తోంది. ఆస్పత్రిలో ఉన్న పరికరాలను ఓ సారి పరిశీలిస్తే.. – కాశీబుగ్గ



రూ.4.5 కోట్లతో ఏర్పాటుచేసిన సీటీ స్కాన్ ఎక్విప్‌మెంట్

- ఉద్దానంలో అపురూప సేవలు అందిస్తున్న పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్
- అత్యాధునిక యంత్రాలతో వైద్యం
- ఊపిరి పీల్చుకుంటున్న ఉద్దానం

ఇదీ కదా.. అభివృద్ధి

● అత్యవసర ఆపరేషన్లకు..



మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్

ఆస్పత్రిలో అత్యాధునిక ఆపరేషన్ గదులున్నాయి. అలాగే వెంటిలేటర్ అనేది ఈ ప్రాంతంలో ఇదివరకు లేనే లేదు. ఒక్కో వెంటిలేటర్‌కు రూ.12లక్షలు వెచ్చించి పది వెంటిలేటర్లు ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రిలో దీనికి గంటల్లో చార్జ్ చేస్తారు. ఇక్కడ మాత్రం ఉచితం.

● ఈఎస్‌డబ్ల్యూఎల్

ఇది కిడ్నీలో రాళ్లను ఆపరేషన్ లేకుండా తొలగించే మిషన్. లేజరు కిరణాలతో విడతలగా రాళ్లను పగలుగొడుతుంది. ఈ వైద్యానికి కార్పొరేట్ ఆస్పత్రిలో విడతకు రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటారు. ఇక్కడ మొత్తం ఉచితం. ఈ యంత్రం ఖరీదు సుమారు రూ.2 కోట్లకుపైగా ఉంటుంది.

● యూఆర్‌ఎస్‌ఎల్

ఇదో ప్రత్యేకమైన లేజరు మిషన్. కిడ్నీలో ఉన్న రాళ్లను కటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. ముందు వివరించిన మిషన్ రాళ్లను బయట నుంచి కట్‌చేస్తే ఈ మిషన్ మాత్రం పైపుద్వారా కిడ్నీకి చేరుకుంటుంది. అక్కడ కట్ చేసి ముక్కలను బయటకు తీసుకు వస్తుంది. ఈ మిషనరీ ఖరీదు రూ.25లక్షలపైగా ఉంటుంది. బయట ఆస్పత్రిలో అయితే ఈ చికిత్సకు రూ.60 వేలు వరకు చార్జ్ చేస్తారు. ఇక్కడ ఉచితం.



కిడ్నీలో రాళ్లను లేజర్‌తో కరిగించే మిషనరీ



ఉచిత మందులు అందిస్తున్న ఫార్మసీ విభాగం

● క్రయోస్పాట్ మిషన్

కేన్సర్‌కు గురైన సెల్స్‌ను, శరీర భాగాలను కలపడం వంటి ప్రక్రియలలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. సుమారు రూ.ముప్పై లక్షల ఖరీదుచేసే ఈ యంత్రంతో వైద్యం పొందాలంటే పెద్ద పట్టణాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం ఉచితంగానే వైద్యం అందిస్తున్నారు.

● సీటీ స్కాన్

రూ.రెండు కోట్లు ఖరీదైన కెనాన్ కంపెనీకి చెందిన సిటీ స్కానింగ్ మిషన్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంది. సీటీ స్కాన్ అంటే శ్రీకాకుళం, విశాఖ పరుగెత్తాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే అందుబాటులోకి వచ్చింది. మనిషి దేహంలో ఏ ప్రాంతంలోనైనా దీనితో స్కాన్ చేయవచ్చు. ఇది కిడ్నీ రోగులకే కాదు. ఎవరికైనా ఉపయోగపడుతుంది.

● అల్ట్రా సౌండ్ మిషన్



300 ఎంఎ స్కానింగ్ మిషన్

అల్ట్రా సౌండ్ మిషన్‌లు సుమారు ఐదు ఏర్పాటు చేశారు. ఒక్కో మిషన్ ఖరీదు రూ.20లక్షలు ఉంటుంది. కడుపులో భాగాలు, కిడ్నీలు వంటి భాగాలతో పాటు దేహంలో ఉన్న ఏ భాగాల్లోనైనా సమస్య ఏమిటన్నది గుర్తించడానికి ఈ స్కానింగ్ విభాగం ఉపయోగపడుతుంది.

ఫుల్లీ ఆటోకెమిస్ట్ బయోకెమిస్ట్ ఎనలైజర్



సీరం క్రియోటిన్ లెవెల్ పరీక్ష ల్యాబ్

ఈ యంత్రం కిడ్నీ పరిశోధన కేంద్రానికి ఎంతో ఉపయోగపడుతుంది. యూరిన్ టెస్ట్, బ్లడ్ టెస్ట్, బ్లడ్ సెల్స్ టెస్ట్, క్రియాటిన్ లెవెల్స్‌తో పాటు 64 రకాల పరీక్షలు ఈ యంత్రంతో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉండే మోడల్ రూ.పన్నెండు లక్షలు ఉంటుంది. బయట మార్కెట్‌లో ఒక్కో పరీక్షకు ఒక్కో ధర ఆయా ఆసుపత్రిని బట్టి నిర్ధారిస్తారు.

'కిరాణా వర్తకులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్

పొందూరు: ఏపీలో కిరాణా వర్తకులను కించపరిచేలా రావులపాలెం సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు జై ప్రతాప్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కిరాణా షాపుల్లో గంజాయి దొరుకుతుందని ఆరోపణలు చేయటంతో వ్యాపారుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. హుందాగా రాజకీయాలు చేసుకోవాలే గానీ ఇలాంటి తప్పుడు విమర్శలు చేయడం తగదని చెప్పారు. కరోనా కష్ట కాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కిరాణా సరుకుల అవసరాలను తీర్చారని గుర్తు చేశారు. కార్పొరేట్ సంస్థలను పెంచి పోషించడమే పరమావధిగా పెట్టుకున్న చంద్రబాబు ఏనాడైనా కిరాణా వర్తకులకు సాయం చేశారా అని ప్రశ్నించారు. 58 నెలల సీఎం వైఎస్ జగన్ పాలనలో వర్తకులకు, వాణిజ్య సంస్థలకు ఎంతో మేలు చేశారని, ప్రోత్సాహక రుణాలు అందజేశారని కొనియాడారు.

ఎంఎస్‌ఎంఈల ద్వారా వ్యాపారులకు రాయితీలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కిరాణా వ్యాపారులు, వైశ్యులు, వర్తక, వ్యాపార సంఘాలు బాబు వ్యాఖ్యలపై ఎన్నికల నియమావళిని అనుసరించి నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి బోగి నూకరాజు, సహాయ కార్యదర్శి గుడ్ల సాయిరాజు, అనకాపల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రేట్.. సెక్రటేరియెట్



టెక్కలి మండలం అక్కవరంలో కుమ్మరి శ్యామలరావు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు ఇస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి

చంద్రబాబు ఆ ఒక్క కుట్ర చేయకుంటే వృద్ధులకు ఇళ్ల వద్దే పింఛన్ వచ్చేది. బాబు ఆ ఒక్క ఫిర్యాదు చేయించకుంటే లబ్ధిదారులకు ఈ ఎండల్లో అవస్థ ఉండేదే కాదు. ప్రభుత్వంపై ఎలాగైనా బురద జల్లాలనే ఆత్రుతతో చంద్రబాబు పింఛన్ల పంపిణీపై కుట్రలు చేస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ మానస పుత్రికైన సచివాలయ వ్యవస్థ ఆ కుట్రను పటాపంచలు చేసింది. ఎక్కడెక్కడి నుంచో ఆపసోపాలు పడుతూ వచ్చిన లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు టెంట్లు వేసి నీడనిచ్చి, తాగునీరు అందించి మరీ పింఛన్లు ఇచ్చి పంపించారు. చంద్రబాబును తిట్టుకుంటూ సచివాలయం వరకు వచ్చిన వారు.. ప్రభుత్వాన్ని, సచివాలయ ఉద్యోగులను మెచ్చుకుంటూ అక్కడి నుంచి వెళ్లారు.

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు కుట్రలు పన్నితే.. అదే వైఎస్ జగన్ ప్రాణం పోసిన సచివాలయ వ్యవస్థ ఆ కుట్రలను విజయవంతంగా ఛేదించి ప్రజలను కాపాడింది. ఎన్నికల నెపంతో చంద్రబాబు అండ్ టీమ్ చేసిన కుట్రలతో ఏప్రిల్‌లో వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీకి బ్రేక్ పడింది. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని భుజానికెత్తుకుంది. కేవలం 3 రోజుల్లోనే 90 శాతానికి పైగా పింఛన్లను పంపిణీ చేసి సీఎం వైఎస్ జగన్ దార్శనికతను జనాలకు చూపించింది. చంద్రబాబు చేసిన కుట్రలతో పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, దివ్యాంగులు, మానసిక దివ్యాంగులతో పాటు ఎంతో మంది పింఛన్‌దారులు అవస్థలు పడ్డారు. బాబు పాలనలో పడిన కష్టాలు గుర్తు తెచ్చుకున్నారు.

- కష్టకాలంలో అండగా నిలిచిన సచివాలయ ఉద్యోగులు
- సచివాలయాలే లేకుంటే పింఛన్ల పంపిణీ ఇంకా కష్టమయ్యేదన్న లబ్ధిదారులు
- టీడీపీ కుట్రలను తిప్పికొట్టిన సచివాలయ వ్యవస్థ

మూడు రోజుల్లో 90 శాతం..

జిల్లాలో మొత్తం 3,21,689 పింఛన్లకు గాను కేవలం మూడు రోజుల్లోనే గ్రామ సచివాలయ వ్యవస్థ కృషితో 2,94,440 మందికి పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. మరో వైపు గ్రామ సచివాలయాల వద్దకు రాలేకపోయిన పింఛన్‌దారుల ఇంటి వద్దకు వెళ్లి మరీ పింఛన్ల డబ్బులు అందజేస్తున్నారు.

వలంటీర్ వ్యవస్థ ఉండి ఉంటే రెండు రోజుల్లో పని పూర్తయి ఉండేది. పింఛన్‌దారులకు సరైన సమాచారం అంది వారిలో ఆందోళన నెలకొనేది కాదు. వలంటీర్లు లేకపోయినా లబ్ధిదారులు ఎక్కువగా ఇబ్బంది పడకుండా సచివాలయాల వద్ద పింఛన్‌దారుల కోసం షామియానాలు, మంచినీటి వసతులు ఏర్పాట్లు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది.

ఏఓబీలో చెక్‌పోస్టు తనిఖీ

మెళియాపుట్టి: ఒడిశా నుంచి ఆంధ్రాకు ప్రవేశిస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఏఓబీ సరిహద్దులోని గొప్పిలి చెక్‌పోస్టును ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. విధి నిర్వహణలో పగడ్బందీగా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. మత్తు పదార్థాలు, మద్యం ఇతరత్రా అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, ఏవైనా విలువైన వస్తువులు రవాణా చేసే అవకాశం ఉందని వాహనాలను తనిఖీ చేసే సందర్భంలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పాతపట్నం సీఐ నల్లి సాయి, స్థానిక ఎస్ఐ టి.రాజేష్, పలువురు సిబ్బంది ఉన్నారు.



గొప్పిలి చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక





నోటికి త్రిశూలాలు గుచ్చుకుని తిరువీధి చేస్తున్న భక్తులు



● నూకాలమ్మా.. కాపాడమ్మా

శ్రీకాకుళం నగరంలో అనకాపల్లి నూకాలమ్మతల్లి మాలధారణ చేసిన భక్తులు త్రిశూలాలు నోటికి గుచ్చుకుని ఉత్సవం చేశారు. నగరంలోని నానుబాలవీధిలోని విజయదుర్గ అమ్మవారి కోవెల నుంచి జిల్లాపరిషత్ వరకూ శుక్రవారం తిరువీధి నిర్వహించారు. ఏటా ఈ మాలధారణ చేసి అనకాపల్లి వెళ్లి మాల విరమణ చేస్తారు. చిన్నారులు సైతం నోటికి త్రిశూలాలు గుచ్చుకుని తిరువీధిలో పాల్గొంటారు. – శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్‌శర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం ఫాల్గుణ బహుళ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మూర్తులుగా అనివేటి మండపంలో వేంచేసింపజేశారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలతో పాటు తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సారా స్థావరాలు ధ్వంసం



ఒడిశా దుర్గం గ్రామంలో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న ఏపీబీ పోలీసుల బృందం

మెళియాపుట్టి: మండల సరిహద్దుల్లోని గొప్పిలి, భరణికోట పంచాయతీలకు ఆనుకుని ఉన్న పలు గ్రామాల్లో ఆంధ్రా ఒడిశా డీటీఎఫ్, ఎస్‌ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు శుక్రవారం సమన్వయంతో సారా తయారీ స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 13,000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 200 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రా ఒడిశా సిబ్బంది కలిసి ముందస్తు సమావేశం నిర్వహించి శుక్రవారం వేకువజామున ఒడిశా సరిహద్దు గ్రామాలకు చేరుకుని ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒడిశా గ్రామాలైన పెదబురుజోల, చిన బురుజోల, బీంపురం, దుర్గం గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 13000లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేయగా.. 200 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వలన కలిగే నష్టాలను తెలియపరచి, సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని సూచించారు. దాడుల్లో ఈఎస్ తిరుపతినాయుడు, సీఐలు రామచంద్ర కుమార్, రాజశేఖర్ నాయుడు, ఎ.బేగమ్‌లతో పాటుగా ఒడిశాపోలీసులు, శ్రీకాకుళం జిల్లా ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి శుక్రవారం ఘనంగా జరిగింది. ఫాల్గుణ మాసం ఏకాదశి సందర్భంగా గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఉంచి ఊరేగించారు.

కుప్పిలికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కవి కుప్పిలి వెంకట రాజారావు

ఆమదాలవలస: మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరిగిన క్రోధి ఉగాది కవి సమ్మేళనంలో ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరాజారావు 'మన్నించుమా జనయిత్రీ' అనే కవితను చదివి, సినీ గీత రచయిత భువన చంద్ర చేతుల మీదుగా ఉగాది పురస్కారం శుక్రవారం అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 60 మంది పాల్గొన్న సభలో రాజారావు ఈ సత్కారం అందుకున్నారు. యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు యం.శంకరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగిందని ఆయన తెలిపారు.

ఉమాకవికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న ఉమాకవి

శ్రీకాకుళం కల్చరల్: నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నిర్వహించిన క్రోధి నామ ఉగాది కవి సమ్మేళనంలో శ్రీకాకుళానికి చెందిన సాహితీ చైతన్యకిరణాలు, బాల కథానిలయం అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావుకు ఉగాది పురస్కారం వరించింది. నెల్లూరు భారతి భాషా సంస్థ, మైసూరు విద్యాలయం ప్రధాన కేంద్రం సంయుక్త నిర్వహణలో శుక్రవారం జరిగిన కవి సమ్మేళనంలో ఉగాది ఉషస్సు అనే కవిత చదివినందుకుగాను సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఆచార్య ఎం.సంపత్‌కుమార్ అందజేశారు.

జన క్షేత్రంలో..

ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రచారాల్లో పదును పెరుగుతోంది. ప్రజలను వ్యక్తిగతంగా కలుస్తూ వారికి చేసిన మేలును వివరించేందుకు నాయకులు ఊరూవాడా పర్యటిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళుతూ అందరి మనసులు గెలుచుకుంటున్నారు.



సోంపేట: బారువ మేజర్ పంచాయతీలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ



పాతపట్నం: పాతపట్నం రామ్‌నగర్‌లో కార్మికుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: కంచరాపువానిపేట గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట:ధర్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రచారం



నందిగాం: మర్లపాడులో ప్రచారం చేస్తున్న శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



టెక్కలి : ఎన్‌టీఆర్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

వైఎస్సార్‌సీపీలో జోరుగా చేరికలు



కాశీబుగ్గ: మంత్రి అప్పలరాజు సమక్షంలో చేరిన 04వ వార్డు రాజాం కాలనీ ప్రజలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 04వ వార్డు రాజాం కాలనీకి చెందిన 150 మంది వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మీసా ల సురేష్‌బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వారికి పార్టీ కండువాలు అప్పగించారు. రెల్ల సత్యం, జి.చంద్రయ్యల నేతృత్వంలో ఆర్.పాపారావు, ఎం.వాసు, ఎం.గురు, ఆర్.నాగరాజు, ఆర్.మోహనరావు, ఆర్.బోగిరాజు, ఆర్.యువరాజు, ఈశ్వరరావు, ఎస్.లక్ష్మణరావు, పి.కృష్ణారావు, ఎం.దుర్యోధనరావు, ఆర్.సావిత్రమ్మ, డిల్లమ్మ, రూపులమ్మ, డి.వరలక్ష్మి, కమల, డిల్లేశ్వరి, ఎం.వాణిశ్రీ, ఎం.పార్వతి, మహాలక్ష్మి, నాగమణి, గజపతి, జి.సంతు, జి.ధర్మారావు, జి.డిల్లేశ్వరరావు, జి.అరుణ, ఆర్.చిన్నమ్మ, జి.అప్పలస్వామి, జంగమయ్య, యాదవరావు, భీమారావు, ఎస్.రామారావు తదితరులు పార్టీ కండువా కప్పుకున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..

మందస: మండలంలోని భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పులారి వెంకటరావు, దుర్యోధనతో పాటు పలు కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరాయి. రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి, ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి సింహాద్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పులారి పాపారావు, జిల్లా జాయింట్ కార్యదర్శి పులారి కూర్మారావు, తవిటయ్య, మామిడి భాగరధి, కొల్లి మోహనరావు, పులారి పీతాంబరం, పులారి సూరి, సార మాధవరావు, దాసరి రాంజీ, కూర్మారావు, వెంకట్ తదితరులు ఉన్నారు.

జనసేన నుంచి..

కంచిలి: మండలంలోని జె.నారాయణపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నేత కాళ్ల రాఘవరావు, ఆయన అనుచరులు ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు తన స్వగృహం కొత్తపుట్టుగ గ్రామంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గోకర్ణపురం ఎంపీటీసీ సభ్యుడు దుర్గాసి మాధవరావు కూడా ఉన్నారు.

మెకానిక్‌ల మద్దతు వైఎస్సార్‌సీపీకే..

టెక్కలి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే తమ మద్దతు అని టెక్కలి మండలం వాహనాల మెకానిక్‌లు ముక్తకంఠంతో తెలిపారు. శుక్రవారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస సమక్షంలో వైఎస్సార్‌సీపీలో మూకుమ్మడిగా చేరారు. ఎన్నికల్లో టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. ఈ చేరికల్లో పార్టీ నాయకులు పి.చంటి, వై.చక్రవర్తి, కె.రవికుమార్ గాంధీ, ఎస్.సోమేష్, బి.విశ్వనాథం, జగదీష్, వి.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న టీడీపీ నాయకులు



కంచిలి: జనసేన నేత కాళ్ల రాఘవరావును వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



టెక్కలి: పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న వెంకటరెడ్డి, దువ్వాడ శ్రీనివాస్

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడికి అభినందన



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు, అధికారులు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర, జాతీయస్థాయిలో కనబర్చిన పోరాట స్ఫూర్తితో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మహారాష్ట్రలోని ఔరంగబాద్ వేదికగా మార్చి 29 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఆలిండియా సబ్–జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సమష్టిగా రాణించి అత్యద్భుతంగా ఆడిన ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంది. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీకాకుళం జిల్లా క్రీడాకారుడు యతిరాజుల పవన్‌కుమార్ జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటకు చెందిన ఈ యువ క్రీడాకారుడు పవన్‌కుమార్ జట్టు విజేతగా నిలవడంతో బంగారు పతకంతోపాటు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.

అభినందించిన డీఈఓ

టోర్నీ ముగించుకుని జిల్లాకు చేరుకున్న పవన్‌ను డీఈఓ కె.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డీవైఈఓ ఆర్.విజయకుమారి, ఏసీ లియాఖత్ ఆలీఖాన్ శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల టెస్ట్ మూల్యాంకన కేంద్రంలో అభినందించారు. క్రీడాకారుడితోపాటు తీర్చిదిద్దుతున్న సంఘ బాధ్యులను, కోచ్‌లను మెచ్చుకున్నారు.

జిల్లా పీటీ, పీఈటీ సంఘ అధ్యక్షకార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బ్యాడ్మింటన్ సంఘ జిల్లా సీఈఓ సంపతిరావు సూరిబాబు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసంహరాజు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, చైర్మన్ బడగల హరిధరరావు, తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.

జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంపునకు కల్పన ఎంపిక



కల్పన హుబ్లీకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విద్యార్థిని కల్పన హుబ్లీకర్ చరిత్ర సృష్టించింది. 14వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ శ్రీకాకుళం కేంద్రం నుంచి జాతీయస్థాయిలో జరిగే ట్రెక్కింగ్ క్యాంపునకు కళాశాల తరఫున ఎంపికైన మొదటి ఎన్‌సీసీ క్యాడెట్‌గా కల్పన హుబ్లీకర్ రికార్డులకు ఎక్కింది. ఈమె కళాశాలలో డిగ్రీ బీఎస్సీ (ఎంపీసీఎస్) ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మే నెల మొదటి వారంలో తమిళనాడులోని ఉదక మండలంలో జరిగే ఈ క్యాంపునకు కళాశాల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్ కల్పన ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ సంతోషం వ్యక్తంచేశారు. మిగతా మహిళలు, పురుషుల ఎన్‌సీసీ క్యాడెట్లకు కల్పన ప్రేరణగా నిలుస్తుందని ఆమె చెప్పారు. ఇందుకు సహకరించిన కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడును, మహిళా కేర్ టేకర్లు వరలక్ష్మి, పావనిలను ఆమె అభినందించారు. జాతీయ ట్రెక్కింగ్ క్యాంప్‌నకు కల్పన ఎంపికపై కళాశాల అధ్యాపకులు సిబ్బంది, సహచర క్యాడెట్లు అభినందించారు.

విజ్ఞానం, వినోదం లక్ష్యంగా టెక్నోవెర్స్ ఫెస్ట్

- ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహణ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, ఏఓముని రామకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: విజ్ఞానం, వినోదం లక్ష్యంగా శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌లో టెక్నోవెర్స్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ తెలిపారు. ఎస్ఎం పురం క్యాంపస్‌లో శుక్రవారం ఫెస్ట్ బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. వర్క్‌షాప్, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అంశాలతో ఈ ఫెస్ట్ ఉంటుందని వివరించారు. ఐఐటీ, ఎన్ఐటీ సాంకేతిక నిపుణులతో వర్క్‌షాపు ఉంటుందని చెప్పారు. సివిల్, మెకానికల్, ట్రిపుల్ ఈ, సీఎస్ఈ, ఈసీఈ ఇలా ప్రతి బ్రాంచుల్లో వస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వర్క్‌షాపు ఉంటుందని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. విద్యార్థులు తమకు వచ్చిన ఆలోచనలతో కూడిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థుల్లో స్ఫూర్తి కలిగించేలా ప్రాజెక్టుల సందర్శనకు అనుమతించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పరిపాన అధికారి ముని రామకృష్ణ, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగం

- సెంచూరియన్ వర్సిటీలో యోగా మహోత్సవం



యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలోని ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ క్రికెట్ మైదానంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, మొరార్జీదేశాయ్ జాతీయ యోగా ఇన్‌స్టిట్యూట్ సహకారంలో సెంచూరియన్ వర్సిటీ భాగస్వామ్యంతో యోగా మహోత్సవ్–2024ను శుక్రవారం ప్రారంభించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని 77 రోజుల కౌంట్ డౌన్ కోర్సులో సెంచూరియన్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఎం సౌమ్యరాణి గౌడో మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ వర్సిటీ విద్యార్థుల యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, ప్రభుత్వ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సౌమ్యరాణీ గౌడో, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢీ, యోగా గురువులు ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ పండా, ప్రొఫెసర్ బాలాజీ పాఢి, ప్రొఫెసర్ జ్ఞానేంద్ర కుమార్ మిశ్రా, ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా నిరోధించాలి

- జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ గంగాధరం

పాతపట్నం: మద్యం, సారా, గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా నిరోధించాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ గంగాధరం సంబంధిత అధికారులకు ఆదేశించారు. పాతపట్నం అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం జిల్లాలోని ఎస్ఈబీ స్టేషన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఒడిశా ఎక్సైజ్ అధికారులతో కలిసి సరిహద్దు గ్రామాల్లో సారాను, బెల్లం ఊటలను ధ్వంసం చేయాలని, అక్రమ రవాణాను అరికట్టాలన్నారు.

ఏఓబీ ప్రాంతాల్లో ఎన్‌డీపీఎల్ రాకుండా చూడాలన్నారు. నరసన్నపేట, పాతపట్నం, టెక్కలి, పలాస, సోంపేట ఎస్ఈబీ స్టేషన్ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో కార్డన్ సెర్చ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలో పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అజ్ఞాత వ్యక్తుల సమాచారం సేకరించారు. మరోవైపు వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఎచ్చెర్ల ఎస్ఐ చిరంజీవులు, జేఆర్ పురం సర్కిల్ ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో స్వాధీనం చేసుకున్న బైక్‌తో పోలీసులు



బాబోయ్ ఎండ

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం ఎండ ఠారెత్తించింది. ఎండతీవ్రతకు ఉక్కపోత కూడా తోడైంది. దీంతో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడ్డారు. –కాశీబుగ్గ



కాశీబుగ్గలో శ్రీనివాస కూడలి వద్ద ఎండ తీవ్రతకు జన సంచారం లేని పరిస్థితి

సంధ్యా కిరణం



సాయం సంధ్య వేళ భానుడు అరుణ కాంతులతో కనువిందు చేశాడు. ఉద్యానంలో తోటల మధ్య, జాతీయ రహదారిపై ఈ చిత్రం కనిపించింది. – మందస